సాక్షి రంగారెడ్డి

బుధవారం | 25 | జనవరి | 2023



బీజేపీ చేసిందేమిటో చెప్పాలి

మతాల పేరుతో గొడవలు పెట్టడం తప్ప బీజేపీ దేశ ప్రజలకు చేసిందేమిటని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా ప్రశ్నించారు. 8లో▸



డ్వాక్రా సంఘాల పనితీరు భేష్

డ్వాక్రా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించడం బాగుందని వివిధ రాష్ట్రాలకు చెందిన ఐడీబీఐ బ్యాంకు అధికారుల బృందం పేర్కొంది. 8లో▸



పశు వైద్యం దైవాదీనం

పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. వ్యాధుల బారిన పడిన జీవాలకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. 8లో▸

పల్లెకు పోదాం చరిత్ర రాద్దాం చలోచలో

'మన ఊరు - మన చరిత్ర'కు శ్రీకారం

- క్షేత్రస్థాయి పర్యటనకు డిగ్రీ విద్యార్థులు
- గ్రామాలకు సంబంధించిన సమస్త సమాచారం సేకరణ
- పల్లె చరిత్రకు పుస్తక రూపం ఇవ్వనున్న స్టూడెంట్స్
- భవిష్యత్ తరాలకు అందించే సంకల్పం



ఇటీవల షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సు

షాద్‌నగర్: పల్లె చరిత్రకు అక్షర రూపం ఇచ్చి.. ఆ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర కళాశాలల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'మన ఊరు - మన చరిత్ర'కు శ్రీకారం చుట్టింది. ఇందు కోసం డిగ్రీ కళాశాల విద్యార్థులను భాగస్వాములను చేసింది. ప్రతి విద్యార్థి చరిత్రకారుడు కావాలని.. మన చరిత్రను మనమే రాసుకుందామని.. పుట్టి పెరిగిన ఊరికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రాబోయే తరాల వారికి అందించాలనేది ప్రభుత్వ సంకల్పం. ఈ మేరకు ఆయా విద్యార్థులకు తమ గ్రామానికి సంబంధించిన సుమారు 50 రకాల సమాచారాన్ని సేకరిస్తున్నారు.

పరిగణలోకి తీసుకుంటున్న అంశాలు

- పల్లెల్లో ఆర్థిక, సామాజిక అంశాలు, వనరులతో పాటు వివిధ అంశాలను అధ్యయనం చేస్తున్నారు.
- గ్రామాల భౌగోళిక నైసర్గిక స్వరూపం, వాగులు, ఏర్లు, కాలువలు, చెరువులు, కుంటలు, బావులు, కొండలు, గుట్టలు, బంజరు భూములు, అడవులు, వ్యవసాయయోగ్యమైన భూములపై వివరాలు సేకరిస్తున్నారు.
- గ్రామం వెనుక ఉన్న చరిత్ర, ఆలయాల విశేషాలు, శాసనాలు, జీవన విధానంలో మార్పులు, సామాజిక వర్గాల సహజీవనం, మతసామర్యం వంటి అంశాలను తెలుసుకుంటున్నారు.
- వ్యవసాయం, పశువుల పెంపకం, కులవృత్తులు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య వ్యవస్థ, పాఠశాలలు, వినోద కేంద్రాలు, పండుగలు, కులాలు, మతాల మధ్య ఉండే అనుబంధాలు, సామాజిక వర్గాల మధ్య పలకరింపులు, ఆప్యాయతలు, గ్రామానికి సంబంధించి ఆట పాటలు, జాతరలు, కవులు, పండితులు, రచనలు, తాళపత్ర గ్రంథాలు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ప్రభావం, గ్రామం పోషించిన పాత్ర వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు.

సమాచార సేకరణ ఇలా..

- కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయకర్తలను కేటాయించి కళాశాలల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రామాల చరిత్రను ఎలా తెలుసుకోవాలి.. పుస్తకంలో ఏవిధంగా రాయాలి అన్న విషయాలపై విద్యార్థులకు ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించారు.
- ఈ మేరకు పల్లె చరిత్ర తెలుసుకునేందుకు డిగ్రీ కళాశాల విద్యార్థులు పల్లెబాట పట్టారు.
- గ్రామాల్లో ఉండే వయోవృద్ధులు, స్వాతంత్ర్య సమరయోధులు, గ్రామ పురోహితుడు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

సేకరించిన తరువాత ఇలా..

- ఈ విద్యాసంవత్సరం చివరినాటికి విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని తమతమ కళాశాలల్లో సమర్పించాల్సి ఉంటుంది.
- విద్యార్థులు సమర్పించిన సమాచారాన్ని కళాశాల అధ్యాపకులు కార్యక్రమానికి సంబంధించిన జిల్లా కో ఆర్డినేటర్‌కు అందజేస్తారు.
- వాళ్లు రాష్ట్ర కళాశాలల విద్యాశాఖకు పంపిస్తారు.
- అన్నీ క్రోడీకరించి ఉత్తమమైనవాటిని ఎంపిక చేసి పుస్తకాల రూపంలో లేదంటే డిజిటల్ లైబ్రరీ రూపంలో ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

భవిష్యత్ తరాలకు ఉపయోగం



పల్లెల చరిత్ర, వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. గ్రామాల ఆర్థిక, సామాజిక వనరులతో పాటు వివిధ అంశాలను అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులకు ఎన్నో విషయాలు తెలుస్తాయి.

– డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆనందంగా ఉంది



గ్రామాల చరిత్రను తెలుసుకొని వాటి గురించి రాసేందుకు అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది. మరుగున పడిన ఎన్నో అంశాలను శోధించి పల్లె ప్రత్యేకతలు, విశిష్టతను నమోదు చేయడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకున్నాను.

– హరి వెన్నెల, విద్యార్థిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, షాద్‌నగర్

చక్కటి అవకాశం



పల్లె జీవనంపై అధ్యయనం చేసేందుకు అవకాశం లభించింది. రైతులు, యువత జీవనస్థితి, సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకొని వాటి గురించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం హర్షణీయం.

– శివ, విద్యార్థి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, షాద్‌నగర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంజన్‌రావు

బాలల హక్కులపై అవగాహన అవసరం

బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు అంజన్‌రావు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు అంజన్‌రావు సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలను జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. జీవించే హక్కు, రక్షణపొందే హక్కు, భాగస్వామ్య హక్కుల గురించి తెలుసుకోవాలని అన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈఓ ప్రవీణ్, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలల కొలువు రాకుండానే..

- ఆర్టీసీ బస్సు, కారు ఢీ
- యువకుడి దుర్మరణం
- నలుగురికి తీవ్ర గాయాలు
- పోలీస్ ఉద్యోగం కోసం నిరంతరం శ్రమ



వినోద్‌కుమార్ మృతదేహం



బస్సు ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

ఆమనగల్లు: పోలీసు కొలువు కోసం ఆ యువకుడు కన్న కలలు కల్లలయ్యాయి. ఆర్టీసీ బస్సు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ కల తీరకుండానే బలి తీసుకుంది. మరో నలుగురు యువకులను ఆస్పత్రి పాల్జేసింది. ఈ విషాదకర సంఘటన మంగళవారం రాత్రి ఆమనగల్లు పట్టణ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు వినోద్‌కుమార్ (25), భరత్‌కుమార్, పవన్‌కళ్యాణ్, వీరేశ్, సుధాకర్ హైదరాబాద్ నల్లకుంటలో ఉంటూ పోలీసు శిక్షణ పొందారు. ప్రిలిమినరీ, ఫిజికల్ ఈవెంట్స్‌లో పాల్గొని మెయిన్ పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారు. కారులో శ్రీశైలం వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ఆమనగల్లులోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భరత్‌కుమార్, పవన్‌కళ్యాణ్, వీరేశ్, సుధాకర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కోనేటిపురం గ్రామానికి చెందిన తిరుపతమ్మకు స్వల్పగాయాలు కాగా చికిత్స నిమిత్తం కల్వకుర్తికి తరలించారు. వినోద్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సుందరయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

పశుమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించండి



అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, పశువైద్య శాఖలో పని చేస్తున్న పశు మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌తోపాటు జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది పశుమిత్రలు ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నారని అన్నారు. ఎలాంటి పారితోషకాలు ఇవ్వకుండా వారితో పని చేయించుకుంటున్నారని విమర్శించారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి జీవో 60 ప్రకారం కనీస వేతనాలు అందజేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, టీఏ, డీఏలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పద్మ, మానస, సంగీత, మౌనిక, సరస్వతి, అనురాధ, లావణ్య, ఉమ, యాదమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

కాన్హాలో లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు

నేటినుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు

నందిగామ: మండల పరిధిలోని కాన్హా హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రం (రామచంద్ర మిషన్)లోని ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంలో బుధవారం నుంచి లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు 8 మంది ప్రముఖుల ఆధ్వర్యంలో మ్యూజికల్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ప్రపంచంలోని సుమారు 120 దేశాలకు చెందిన అభ్యాసీలు హాజరయ్యే అవకాశం ఉందని పీఆర్‌ఓ చంద్రారెడ్డి చెప్పారు.వారి కోసం హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చెందిన అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని, తిమ్మాపూర్, షాద్‌నగర్ రైల్వే స్టేషన్ల నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వసంత పంచమికి 108 ప్రత్యేక బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 26న వసంత పంచమి సందర్భంగా 108 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరకు 88, సిద్దిపేట జిల్లాలోని వర్గల్‌కు 20 ప్రత్యేక బస్సులను నడపనున్నారు. 25, 26వ తేదీల్లో ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. బాసరకు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి 21, జూబ్లీబస్‌స్టేషన్ నుంచి 12 చొప్పున నడుపుతారు. నిజామాబాద్ నుంచి 45 బస్సులు, హన్మకొండ నుంచి 5, కరీంనగర్ నుంచి 4 బస్సులు, జగిత్యాల నుంచి ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేశారు. వర్గల్‌కు సికింద్రాబాద్ (గురుద్వార) నుంచి ప్రతి అరగంటకో బస్సు నడిచేలా ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ గురుద్వార నుంచి 10, జేబీఎస్ నుంచి 6, గజ్వేల్ నుంచి 2, సిద్దిపేట నుంచి 2 చొప్పున బస్సులు నడపనున్నారు. భక్తుల రద్దీ మేరకు సర్వీసులను పెంచనున్నారు.

మళ్లీ పెరగనున్న చలి తీవ్రత



సాక్షి, సిటీబ్యూరో: చలితీవ్రత ఈ నెల 26 నుంచి అనూహ్యంగా పెరగనుంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సుమారు వారం రోజులపాటు కనిష్ట ఉష్ణోగ్రతలు పలు చోట్ల 10 నుంచి 11 డిగ్రీలకు పడిపోయే అవకాశాలున్నట్లు ప్రకటించింది. ప్రధానంగా చార్మినార్, ఖైరతాబాద్, ఎల్బీనగర్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలో కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతాయని స్పష్టం చేసింది. ఉదయం వేళల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వృద్ధులు, రోగులు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. మంగళవారం నగరంలో గరిష్టంగా 30 డిగ్రీలు, కనిష్టంగా 18.6 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తేమ 39 శాతంగా నమోదైంది.

విద్యాదానం ఎంతో గొప్పది



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తాం
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అన్ని దానాల్లో విద్యాదానం ఎంతో గొప్పదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత అందిస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో పరిధిలోని బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటన చేసినప్పుడు అక్కడి ప్రభుత్వ పాఠశాలలు బాగున్నాయని కితాబు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ తెలంగాణలో మాత్రం దరిద్రంగా ఉన్నాయని మండిపడ్డారు. పేద విద్యార్థులకు విద్యాదానం చేయడం ద్వారా వారు ప్రయోజకులు అవుతారని తెలిపారు. నలుగురికి సహాయం చేస్తే ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. 38 మంది విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించడం అభినయందనీయమన్నారు. సమయం వృథా చేయకుండా బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. పేద విద్యార్థుల చదువుకు దాతల సహకారం అవసరమన్నారు. రూ.1.20 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఆదర్శ పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట చేసేందుకు షెడ్డు లేకపోవడంతో అప్పటికప్పుడు రూ. 50వేలు అందజేశారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా బోరు, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదో తరగతిలో 9.5 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు రూ. 10వేలు, 10 గ్రేడ్ పాయింట్లు వచ్చిన వారికి రూ. 25 వేలు నాలుగు సంవత్సరాల పాటు ఇస్తానని తెలిపారు. విద్యార్థుల చదువుల కోసం కృషి చేస్తున్న నిత్యా నిరంజన్‌రెడ్డి దంపతులను ఎంపీ అభినందించారు. తన బెంజ్ కారులో విద్యార్థులను ఎక్కించుకొని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందడి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, మంచాల జెడ్పీటీసీ నిత్యా నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు మర్రి అర్చన, కుంట్ల మౌనిక, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, నల్లబోలు లావణ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు గౌని బాల్‌రాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్‌గౌడ్, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు మహిపాల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం.. ఏదీ పరిష్కారం?

'కేశంపేట మండలం ఇప్పలపల్లి సమీపంలోని సుందర్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమ నుంచి దట్టమైన పొగ వెలువడుతోంది. కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఊపిరాడక పశువులు మృత్యువాత పడుతుండడంతో స్థానికులు పీసీబీకి ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితం జేడీ పరిశ్రమను సందర్శించి నోటీసులిచ్చారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు'.

'కడ్తాల్ మండలం ఆన్మాస్‌పల్లి సమీపంలోని ఎక్స్‌ప్లో ఫ్యాబ్ మెటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి పెద్ద ఎత్తునే పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. తట్టుకోలేక కందుకూరు, కడ్తాల్ మండల ప్రజలు ఆందోళనకు దిగారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సబితకు విజ్ఞప్తి చేశారు. అయినా ఇప్పటి వరకు చర్యలు లేవు'.

'తుర్కయంజాల్ బ్రాహ్మణపల్లి సమీపంలోని కాంకర్డ్ డ్రగ్స్ అండ్ కెమికల్ కంపెనీ నుంచి వెలువడే రసాయన వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకర్ల ద్వారా బయటికి తరలించి సమీపంలోని చెరువులో కలిపేస్తున్నారు. చెరువులోని చేపలతో పాటు నీటిని తాగిన పశు, పక్షాదులు మృత్యువాతపడుతుండటంతో ఇటీవల స్థానికులు ధర్నాకు దిగారు'.

- నిబంధనలు పట్టని పరిశ్రమలు
- గుట్టుగా వ్యర్థాల తరలింపు
- స్థానిక చెరువులు, ఖాళీ ప్రదేశాల్లో డంప్
- పశుపక్షాదుల మృత్యువాత
- విష వాయువులతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని పీసీబీ అధికారులు



తుర్కయంజాల్ పరిధిలో కాలుష్యకారక పరిశ్రమను మూసివేయాలని స్థానికుల ధర్నా (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని పలు పరిశ్రమలు పర్యావరణానికే కాదు ప్రజారోగ్యానికి పెను ముప్పుగా మారాయి. ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలను సమీపంలోని చెరువులు, కుంటలు, ఖాళీ స్థలాల్లో పారబోస్తూ పశు పక్షాదుల మృత్యువాతకు కారణమవుతున్నాయి. ఆయా కంపెనీలు వదులుతున్న విష వాయువులతో ఊపిరాడక స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని చేస్తున్న పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకోవాల్సిన పీసీబీ అధికారులు నోటీసులతోనే సరిపెడుతున్నారు.

గుట్టుగా వ్యర్థాల తరలింపు

జిల్లాలో సుమారు 24 పారిశ్రామికవాడలు ఉన్నాయి. వీటిలో చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలు 13,732 వరకు ఉన్నాయి. సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో 2,265 ఐటీ అనుబంధ పరిశ్రమలు ఉండగా, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 7,215, సరూర్‌నగర్ పరిధిలో 4,252 చిన్న, మధ్య తరహా, కుటీర పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా స్టోన్ క్రషర్, ఐరన్, ప్లాస్టిక్, బల్క్‌డ్రగ్, ఫార్మా పరిశ్రమలు కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఆయా పరిశ్రమలు స్థాపనకు ముందు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు హామీ పత్రాలు దాఖలు చేస్తుంటాయి. కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను ఎక్కడ పడితే అక్కడ కాకుండా శాస్త్రీయ పద్ధతిలో పూడ్చాల్సి ఉంటుంది. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో చాలా కంపెనీలు రాత్రికిరాత్రే గుట్టుగా బయటికి వ్యర్థాలను తరలిస్తున్నాయి.

మచ్చుకు కొన్ని..

- జేపీదర్గా సమీపంలోని ఓ ఫార్మా కంపెనీపై జాతీయ హరిత ట్రిబ్యూనల్‌లో కేసు కొనసాగుతోంది. కెమికల్ పొల్యూషన్‌తో ఆ కంపెనీలో పని చేసే వారితో పాటు చుట్టుపక్కల పని చేసే వారు అనారోగ్యానికి గురవుతున్నారు.
- యాచారం సమీపంలోని ఓ పవర్‌ప్లాంట్‌లో కోళ్ల వ్యర్థాలను వాడుతూ వాయు కాలుష్యానికి కారణమవుతున్నారు.
- బండరావిర్యాల స్టోన్ క్రషర్లపై స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. జాతీయ హరిత ట్రిబ్యూనల్‌లో కేసులు కొనసాగుతున్నాయి.
- కాటేదాన్, షాద్‌నగర్, మహేశ్వరం మంఖాల్ పారిశ్రామిక వాడలోనూ ఘాటైన వాసనలు వెదజల్లుతున్నాయి. స్వేచ్ఛగా ఊపిరి తీసుకోలేని దుస్థితి. స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకూడదు. కానీ కోకాపేట్, వట్టి నాగులపల్లి, గోపన్‌పల్లి, కొల్లూరు, కొత్వాల్‌గూడ, శంకర్‌పల్లి, మిర్జాగూడ, జన్వాడ, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసరాల్లో రెడీ మిక్స్ ప్లాంట్లు.. స్టోన్ క్రషర్ మిషన్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

జీవరాశుల మనుగడకు దెబ్బ

కంపెనీలు వెదజల్లే కాలుష్య ప్రభావం మూడు నాలుగు కిలోమీటర్ల వరకూ ఉంటోంది. చాలా కంపెనీలు ఉత్పత్తులు ప్రారంభించిన తర్వాత సీఎఫ్‌ఓ నిబంధనలు విస్మరిస్తున్నాయి. వ్యర్థాలను గుట్టుగా బయటికి తరలించి నాలాలు, చెరువులు, ఖాళీ స్థలాల్లో పారబోస్తూ జీవరాశుల మనుగడను దెబ్బతీస్తున్నాయి. కంపెనీలు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి పీసీబీ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

– ఓరుగంటి యాదయ్య, సీపీఐ రాష్ట్ర నాయకుడు

దేశానికి చేసిందేమిటో చెప్పాలి



మీర్‌పేట సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ పాషా

- బీజేపీపై సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా ఫైర్
- మతాల పేరుతో రెచ్చగొడుతున్నారని ఆరోపణ

మీర్‌పేట: ప్రజల మధ్య మతాల పేరుతో గొడవలు పెట్టడం తప్ప బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమిటని సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు అజీజ్‌పాషా ప్రశ్నించారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌లో సీపీఐ మండల సమితి కార్యాలయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, పల్లా నర్సింహారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ ఆర్థిక పరిస్థితి దిగజారడంతో పాటు నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. కార్మికులు, కర్షకులను పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగ సమస్యతో పేదరికం పెరిగిపోతోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలవుతుందని, కావున ప్రజలంతా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో మీర్‌పేట ప్రాంతంలో ప్రధాన పార్టీలంతా కలిసి ఒక అభ్యర్థిని నిలబడితే, సీపీఐ మాత్రం ఒక దళిత యువకున్ని పోటీలో ఉంచిందని, అతనికి ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోని కొందరు సీపీఐ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడారని, అయినా కార్యకర్తలు, అభిమానులు పార్టీ వెంటే ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో మీర్‌పేటలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బాలాపూర్ మండలంలో సీపీఐ పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు అందుబాటులో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఏ అవసరం, ఆపద వచ్చినా ముందుండాలని ఆయన నాయకులకు సూచించారు. మండల కార్యదర్శి అయోధ్య వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రవీంద్రాచారి, సభ్యులు పానుగంటి పర్వతాలు, శ్రామిక మహిళా సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ చంద్రయ్య, దత్తు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ పర్యటనకు వెళ్లిన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తిరుగు ప్రయాణంలో మంగళవారం రాత్రి షాద్‌నగర్ బైపాస్‌లో ఆగారు. అక్కడ ఛాయ్ తాగి బీజేపీ నేతలతో ముచ్చటించారు. స్థానిక నేతలు వారిని సన్మానించారు. అనంతరం తరుణ్‌చుగ్, బండి సంజయ్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. - షాద్‌నగర్

పశువైద్యం.. దైవాదీనం



కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లిలో మూతపడిన పశువైద్య ఉపకేంద్రం

- సిబ్బంది లేక మూతపడుతున్న కేంద్రాలు
- ఇబ్బందుల్లో పాడి రైతులు

కొందుర్గు: పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. వ్యాధుల బారిన పడిన జీవాలకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. గ్రామాల్లో వ్యవసాయం తోపాటు పాడి పరిశ్రమే రైతులకు జీవనాధారం. కానీ జీవాలకు వ్యాధులు సోకితే వైద్యం చేయడానికి డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. పలు గ్రామాల్లో డాక్టర్లు, సిబ్బంది లేక పశు వైద్య కేంద్రాలు మూతపడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని రైతాంగం వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తోంది.

సిబ్బంది లేక మూత

పశువులకు వైద్యం చేసేందుకు డాక్టర్లు, సిబ్బంది లేక పలు కేంద్రాలు మూతపడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడానికి 53 మంది పశుగణ సహాయకులు ఉండాలి. కానీ 17 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు 18 మందికి 10 మందే ఉన్నారు. వీఎల్‌ఓలు, వెటర్నరీ అసిస్టెంట్లు మాత్రమే అవసరం మేరకు ఉన్నారు. 46 మంది పశువైద్యులకు గాను ఒక్క పోస్టు ఖాళీగా ఉంది. 72 మంది అటెండర్లు ఉండాల్సి ఉండగా కేవలం 35 మందితో నెట్టుకొస్తున్నారు. చేవెళ్ల పరిధిలోని ఆలూరు, షాద్‌నగర్ పరిధిలోని చౌదరిగూడ, కల్వకుర్తి పరిధిలోని కడ్తాల మండల పశు వైద్యశాలల్లో డాక్టర్లు లేరు. అటెండర్లు, పశుగణ సహాయకులు సేవలందిస్తున్నారు. కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లి, జిల్లేడ్‌చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల పశు వైద్య ఉప కేంద్రాలు సిబ్బంది లేక పోవడంతో మూతపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

జిల్లాలో పశువుల వివరాలు

గోజాతి	2,40,826
గేదె జాతి	1,67,018
గొర్రెలు	7,67,125
మేకలు	2,56,632
మొత్తం:	14,31,601

పశువైద్య కేంద్రాలు

ప్రాంతీయ పశు వైద్యశాలలు	4
మండల పశు వైద్యశాలలు	46
గ్రామీణ పశు వైద్యశాలలు	87
సంచార వైద్య వాహనాలు	4

గోపాల మిత్రలు 28 మంది

కేంద్రాలు మూసివేస్తే ఎలా?



గ్రామీణ ప్రాంతాల్లోనే రైతులు అధికంగా ఉంటారు. ఇక్కడి వారికి వ్యవసాయంతోపాటు పశుపోషణ ప్రధాన వృత్తి. గ్రామాల్లోని పశు వైద్య కేంద్రాలను సిబ్బంది లేని కారణంగా మూసివేస్తున్నారు. దీంతో వ్యాధుల బారిన పడిన జీవాలను ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియడం లేదు.

- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, ఉత్తరాసిపల్లి, కొందుర్గు మండలం

సిబ్బంది కొరత వల్లే సమస్య



సిబ్బంది కొరత వల్ల కొన్ని కేంద్రాలు సరిగ్గా తెరవడం లేదు. సమీప కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిని వారానికి ఒకటి, రెండు రోజులు పంపిస్తున్నాం. ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీల్లో దాదాపు పూర్తిస్థాయి సిబ్బంది విధుల్లో చేరే అవకాశం ఉంటుంది. అత్యవసరం అయితే సంచార పశువైద్య అంబులెన్స్‌కు కాల్ చేయాలి.

- డాక్టర్ అంజిలప్ప, జిల్లా పశు వైద్యాధికారి, రంగారెడ్డి

29న ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ మీట్

సాక్షి, హైదరాబాద్: అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఆర్‌ఆర్ ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో ఈనెల 29న బాలబాలికలకు ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ మీట్ జరగనుంది. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో ఈ మీట్‌ను నిర్వహిస్తారు. అండర్-10, 12, 14, అండర్-16 వయో విభాగాల్లో పోటీలు ఉంటాయి. 50 మీటర్లు, 60 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, 800 మీటర్ల విభాగాల్లో రేసులు ఉంటాయి. లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఈవెంట్స్‌ను కూడా నిర్వహిస్తారు. ఆసక్తిగల వారు 7794077834, 7075800939 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

డ్వాక్రా సంఘాల పనితీరు భేష్



డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న బుచ్చిబాబు, భాస్కర్ తదితరులు

- ఐడీబీఐ బ్యాంక్ అధికారుల బృందం

యాచారం: ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో డ్వాక్రా సంఘాలు వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి సాధించడం బాగుందని వివిధ రాష్ట్రాలకు చెందిన ఐడీబీఐ బ్యాంకు అధికారుల బృందం పేర్కొంది. ఇక్కడి మహిళల స్వయం కృషిని తమ తమ రాష్ట్రాల్లోని మహిళలకు తెలియజేసి వారిని చైతన్య పరుస్తామని తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన 35 మంది బ్యాంకు అధికారుల బృందం మంగళవారం నల్లవెల్లి గ్రామంలో పర్యటించింది. డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమై ప్రభుత్వ రుణాల ద్వారా లబ్ధి పొందుతున్న తీరుపై అధ్యయనం చేసింది. రుణాలు పొందే పద్ధతి, చెల్లింపులు, సంఘం సమావేశాలు, వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి, రికార్డుల నమోదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది వివిధ దుకాణాలు, చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకుని ఆర్థిక ప్రగతి సాధిస్తున్న తీరు, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్న తీరు తెలుసుకొని అభినందించారు. అనంతరం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. మహిళలు లబ్ధి పొందుతున్న తీరుపై ఎంపీపీ కొప్పు సుకన్య బ్యాంక్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ బుచ్చిబాబు, డిప్యూటీ మేనేజర్ భాస్కర్, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ జంగారెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు బాల్‌రాజ్, స్వర్ణలత, నర్సింహ, మండల ఏపీఎం సతీష్, వివిధ గ్రామాల సీసీలు పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3.96 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆనంద్‌నగర్ కాలనీలో రూ.18 లక్షలతో పార్కు, రూ.3.78 కోట్లతో అభ్యుదయ నగర్, సాయిబాబానగర్, మైత్రి కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌ల పరిధిలోని కాలనీలు, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని మండలాల్లో సమస్యలు లేకుండా చూస్తామన్నారు.

రేపు చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26న బీఎస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఓపెన్ చెస్ టోర్నీ జరగనుంది. కొత్తపేట అల్కాపురి రోడ్ నంబర్-2లోని బీఎస్ చెస్ అకాడమీలో ఈ టోర్నీని నిర్వహిస్తారు. ఓపెన్ విభాగంలో టాప్-15లో నిలిచిన వారికి నగదు పురస్కారాలు... అండర్-7, 9, 11, 13, అండర్-15 వయో విభాగాల్లో టాప్-3లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తారు. ఆసక్తి గలవారు ఈనెల 25వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వివరాలకు కోచ్ బొల్లం సంపత్‌ను 9066567567 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

రేపటి నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి రథోత్సవం

26నుంచి ఉత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి 29వ వార్షిక మహోత్సవాలు, రథోత్సవాలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 26 నుంచి 29 వరకు రథోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మాలలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. రథోత్సవాలను తిలకించేందుకు, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26వ తేదీన ఉదయం 3 గంటలకు పెద్దమ్మ తల్లికి అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 8.45 గంటలకు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చే విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, అంకురారోహణం తదితర పూజలు జరుగుతాయి. చండీ పారాయణాలు, నవగ్రహ జపాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం అగ్ని ప్రతిష్టాపన, మండప పూజలు జరుగుతాయి. ఈ నెల 27వ తేదీన మండప పూజలు, సప్తశతి పారాయణం జరుగుతాయి. ఈ నెల 28న సాయంత్రం 6 గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవ మూర్తి రథంపై ఊరేగింపు, విశేష బాణాసంచా విన్యాసాలు ఉంటాయి. అదే రోజు మధ్యాహ్నం రథ పూజ, పూర్ణాహుతి నిర్వహిస్తారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయనుండటంతో ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వెల్లడించారు.

నిబంధనలు పాటించని పబ్ మూసివేత

బంజారాహిల్స్: నిబంధనలు బేఖాతరు చేస్తూ అనుమతులు లేకుండా కొనసాగుతున్న పబ్‌ను మూసివేయడమే కాకుండా నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే...జూబ్లీహిల్స్ రోడ్‌నెం.10లో నాలుగు రోజుల క్రితం బేబీలాన్ బార్ అండ్ కిచెన్ తెరిచారు. అయితే నిర్వాహకులు అమ్యూజ్‌మెంట్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తుండటంతో పాటు పార్కింగ్ సదుపాయం అసలే లేకుండా రోడ్డుకు రెండువైపులా వాహనాలు నిలుపుతుండటంతో స్థానికులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ జి. నర్సింహారావు, ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ పబ్‌పై కేసు ఐపీసీ సెక్షన్ 341, 290, 188 కింద కేసు నమోదు చేశారు. అలాగే అమ్యూజ్‌మెంట్ లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న పబ్‌పై జూబ్లీహిల్స్ ఎస్‌ఐ రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 21/76 సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి పబ్ సీజ్ చేశారు.

అయోమయంలో ‘డబుల్’ అర్హులు

- 96 ఇళ్లకు 460 దరఖాస్తులు
- అగమ్యగోచరంగా 361మంది పరిస్థితి
- అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్



లింగంపల్లి సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

మంచాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎవరికి దక్కుతాయో అర్థం కాని దుస్థితి నెలకొంది. ఉన్న ఇళ్లకు ఐదింతలు దరఖాస్తులు వచ్చాయి. నాలుగేళ్ల క్రితం మండలంలోని లింగంపల్లి గేట్ సమీపంలో ప్రభుత్వం 96 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. మొదట్లో అర్హులైన వారందరికీ ఇళ్లు వస్తాయని ప్రజలు భావించారు. కానీ మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాల ప్రజలకు మాత్రమే మంజూరు చేయనున్నట్లు తెలిసింది. మంచాల గ్రామంలో 276, నోముల గ్రామంలో 85, లింగంపల్లి గ్రామంలో 99 చొప్పున 460 దరఖాస్తులు వచ్చాయి. అయితే 96 ఇళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉండగా గత రెండు రోజుల నుంచి ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతోంది. దీంతో దరఖాస్తు దారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం అర్హులందరికీ డబుల్ ఇళ్లు ఇస్తామని ప్రకటించింది. దరఖాస్తు దారులకు అవసరమైన మేరకు ఇళ్లు లేకపోవడంతో అర్హులను గుర్తించడం అధికారులకు కష్టంగా మారింది.

అర్హులను గుర్తించే పనిలో అధికారులు

మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు అర్హులను గుర్తించే పని అధికార యంత్రాంగం ప్రారంభించింది. మండల స్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి వారి ఇళ్లను పరిశీలించడమే కాకుండా వారి ఆర్థిక స్థితిగతులు, భూములు ఇతర వివరాలను సేకరిస్తున్నారు. ఫిబ్రవరి 6వ తేదీ నాటికి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిసింది. అనంతరం లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. దీంతో డబుల్ ఇళ్ల లక్కు ఎవరికి ఉందో మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు. ఇదిలా ఉండగా గతంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన చెన్నారెడ్డి గూడ గ్రామస్తులకు, లింగంపల్లి గ్రామంలో వైద్యం వికటించి చనిపోయిన వారికి, ఇలా వివిధ ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. నేడు చాలీచాలని ఇళ్లను ఏ విధంగా అర్హులైన పేదలకు ఇస్తారనేదే సమస్యగా మారింది.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



మండలంలోని అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలి. కొన్ని సంవత్సరాలుగా పేదలు డబుల్ ఇళ్ల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. నేడు లాటరీ పేరుతో పేదలను డబుల్ ఇళ్లకు దూరం చేయరాదు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలి.

- నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ, మంచాల

ప్రక్రియ ప్రారంభం



మండలంలోని నోముల, లింగంపల్లి, మంచాల గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు అర్హుల జాబితాను తయారు చేస్తారు. ప్రజల సమక్షంలో లాటరీ తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

- అనిత, తహసీల్దార్, మంచాల